క్లుప్తంగా

మొదటి రోజు ముగ్గురి నామినేషన్



నామినేషన్ పత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ స్థానానికి మొదటి రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్లు, ఇండిపెండెంట్లు బేతి నరేందర్, మర్రి స్వామి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ), కలెక్టర్ హనుమంతు కే.జెండగే నామినేషన్లను స్వీకరించారు.

కొమ్మూరిని కలిసిన కిరణ్‌కుమార్



జనగామ: డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో కురుమ కులస్తులు నిర్వహించే బీరప్ప పెద్ద పండుగకు హాజరు కావాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు జక్కుల యాదగిరి ఆహ్వానించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఈ నెల 27వ తేదీ నుంచి బీరప్ప పెద్ద పండుగను నిర్వహిస్తామని తెలిపారు. ప్రారంభం రోజున నిర్వహించే అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపునకు ఎమ్మెల్యే తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. టైలర్ల సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మన్ గాలి తిరుపతి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: త్రైత సిద్ధాంత పీఠాధిపతి ఆచార్య ప్రబోదానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ప్రబోధా సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా ఉగాది త్రైతశకం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు క్యాలెండర్ ఖురాన్ హదీస్లను కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో జనగామ, చేర్యాల సేవా సమితి సభ్యులు మెరుగు రామరాజు, ఉపేందర్, వెంకటేష్, నాగరాజు, సావిత్రి పాల్గొన్నారు.

ఆదిశేష వాహనంపై స్వామివారి ఊరేగింపు

చిల్పూరు: మండలంలోని నష్కల్ సీతారామ చంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు గురువారం రాత్రి ఆదిశేషవాహనంపై సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా అర్చకుల వేద మంత్రాల నడుమ సాయంత్రం హోమం నిర్వహించారు. రాత్రి ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో సీతారామచంద్ర స్వామి సేవా ట్రస్ట్ బాధ్యుడు జూలూరి రాజు, ఆలయ చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, మాజీ సర్పంచ్ కర్నకంటి స్వప్నవెంకటేష్, నంగునూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



చిల్పూరు: ఫతేపూర్ నుంచి కృష్ణాజీగూడెం వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాలు వెళ్లేందుకు కష్టంగా మారింది. దీంతో గుంతలు పూడ్చించాలని అధికారులకు, పాలకులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. కాగా, గురువారం ఆటో కార్మికులే స్వచ్ఛందంగా గుంతల్లో మొరం పోయించి వాటిని పూడ్చివేశారు. అధికారులు, నాయకులు పట్టించుకుని గుంతల్లో తారు పోయించాలని వారు కోరుతున్నారు.

'అదును తప్పినంక సాగునీరు విడుదల తగదు'

దేవరుప్పుల: యాసంగి పంట అదును తప్పినంక సాగునీరు విడుదల తగదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు అల్లం ప్రదీర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట దిగుమతి అయ్యే సమయంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాల్వల పరిశీలనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దిగుమతి అయ్యే పంటల తీరును పరిశీలించి ధాన్యం కొనుగోళ్లలో గిట్టుబాటు ధరతోపాటు ఇచ్చిన హామీ మేరకు బోనస్ రూ.500 ఇప్పించాలని డిమాండ్ చేశారు. జనవరి, ఫిబ్రవరిలో నెలలో కాల్వలకు నీరు వదిలిపెడితే రైతాంగానికి ప్రయోజనం కలిగేదని, అలాంటి అత్యవసర సమయంలో నిర్లక్ష్యం వహించి నేడు కాల్వల వెంట తిరిగి ప్రకటనలకు పరిమితమవుతున్న కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షపార్టీలపై ఉనికి కోసం అర్థరహిత విమర్శలు చేయడం తగదన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

● ఘనంగా అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్‌డే



రఘునాథపల్లి: చిన్నారులతో పంచాయతీ కార్యదర్శి నర్సింహ

రఘునాథపల్లి: తల్లిదండ్రులు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని ఇబ్రహీంపూర్ పంచాయతీ కార్యదర్శి నర్సింహ కోరారు. మండలంలోని ఇబ్రహీంపూర్, భాంజీపేట, లక్ష్మీతండా, రామచంద్రంగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ప్రీ స్కూల్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడారు. మూడేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీలో చదువుతో పాటు ఆట, పాటలు, కథలు వారి మేధస్సును పెంచుతాయన్నారు. మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పితే వారిలో మానసిక, శారీరక, ఆరోగ్య అభివృద్ధి జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, హేమలత, మంజుల, ప్రేమలత, మహేశ్వరి, ఆయాలు ప్రమీల, రమాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పిన అక్షరాలను వారి తల్లుల సమక్షంలో రాసి చూపించే కార్యక్రమమే ప్రీ స్కూల్‌డే ఉద్దేశమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ డేను టీచర్ గుర్రం సీనా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దూలమ్మ మాట్లాడుతూ చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా వారికి అక్షరాలతో పాటు ఆట, పాటలు నేర్పించడంతో పాఠశాలలకు వెళ్తే చదులో ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు.



చిల్పూరులో..

ఐదేళ్లు నిండిన చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసి ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు అప్‌గ్రేడ్ అయ్యే సూచనలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, నసీరుద్దీన్, టీచర్లు పాల్గొన్నారు.

అప్పిరెడ్డిపల్లెలో..

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి నేర్చుకున్న తీరుపై ప్రతిభాపోటీలు నిర్వహించారు.

మహా పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

జనగామ: పట్టణంలోని 27 వార్డు పాత బీట్‌బజార్ శ్రీరామ నవమి పందిరి వద్ద 71వ సారి చేపట్టిన సీతారాముల కల్యాణం ఘనంగా జరిపించగా, గురువారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. అంతకు ముందు పండితులు.. నిర్వాహకులు, భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త తదితరులు ఉన్నారు.

'బీజేపీ మేనిఫెస్టోలో రైతులపై నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న చందు

జనగామ రూరల్: రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు బీజేపీ మేనిఫెస్టోలో చేర్చకుండా వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందు విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కార్మికులు, రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వకుండా దేశాన్ని ఉద్ధరిస్తామని గొప్పలు చెప్పుకోవడం బీజేపీకి సరికాదన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు చేసిన సూచనలు అమలు చేసి కనీస మద్దతు ధర రైతులకు అందేలా చూడాలని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రైతాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, మీట్యానాయక్, పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న పార్థసారథి

నర్మెట: వేసవి ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని డీఎల్‌పీఓ పార్థసారథి అన్నారు. మండల కేంద్ర గ్రామ పంచాయతీలో గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలు వంద శాతం చేయడంతోపాటు పారిశుద్ధ్య నిర్వణలో శ్రద్ధ వహించాలని, విధులపట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. నెలలో మూడుసార్లు ట్యాంకుల్లో ఫ్లోరినేషన్ చేయడంతో పాటు నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలన్నారు. వృత్తి, వ్యాపార లైసెన్స్‌లను ఈనెలాఖరులోగా రెన్యూవల్ చేయాలని కార్యదర్శి కందకట్ల శ్రీధర్‌కు సూచించారు. ఆయన వెంట బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'కావ్యపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న సారయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్‌పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యపై కులం, మతం పేరుతో ప్రతిపక్ష పార్టీల నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కులాంతర వివాహితుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పెసరు సారయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యపై ప్రతిపక్ష పార్టీల నాయకులు అవగాహన లేకుండా కులాంతర, మతాంతర వివాహం అంటూ కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కావ్యకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే చవకబారు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సీహెచ్.నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, రాజు, కులాంతర వివాహితుల సంఘం జిల్లా నాయకులు చిలగాని రాకేష్, సముద్రాల రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చెక్‌పోస్టులో తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగాలఘణపురం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని జీడికల్ వద్ద మార్చి 21న ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఈనెల 3 వరకు కొనసాగించి నిలిపి వేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరిగి గురువారం నుంచి ప్రారంభించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎస్సై చింత రాజు, హార్టికల్చర్ ఆఫీసర్ ధీరజ్‌తో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



నోటీసుబోర్డుపై ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను ఏర్పాటు చేస్తున్న ఆర్‌డీఓ

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలను పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సందర్భంగా స్థానిక ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు రెవెన్యూ డివిజన్‌లోని అన్ని గ్రామ పంచాయతీల్లో నోటిఫికేషన్ ప్రతులను నోటీసుబోర్డులపై ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టాలన్నా తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. అందరూ ఎన్నికల నిబంధనల్ని పాటిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

చిల్పూరు: రజకుల కులదైవం మడేలయ్య దేవాలయ నిర్మాణానికి గురువారం మాజీ సర్పంచ్ లొడెం రజితరవీందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని రజకులు ఆలయ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొండ తిరుపతి, గూళ్ల ప్రకాష్, వెంకట్‌రెడ్డి, చొక్కం కుమార్, రజక బాధ్యులు వెలిశాల అనీల్, సందీప్, కనుకయ్య, యాదయ్య, రాజయ్య, శంకర్, నేరెళ్ల యాదయ్య, కనుకయ్య, రవికుమార్, భండరపు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కంచుకోటగా పాలకుర్తిని తీర్చిదిద్దుదాం..



ఝాన్సీరెడ్డి సమక్షంలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గాన్ని కాంగ్రెస్ కంచుకోటగా తీర్చిదిద్దుదామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో కడవెండి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ధర్మారెడ్డి, గ్రామ అధ్యక్షుడు చెన్నూరి రాంబాబు, లీనారెడ్డి, రెడ్డిరాజుల రమేష్, సుధాకర్, యాకస్వామి, భాషిపాక భిక్షపతి, పులిగిల్ల వెంకన్న, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మాసంపల్లి సాత్విక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లో నడిగట్టు మల్లయ్య, మేక ఎర్రబీరు మల్లయ్య, అత్మూరి మల్లయ్య, ముక్కెర ఐలయ్య ఇటీవల మృతి చెందారు. కాగా, గురువారం సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి బాధిత కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు మిన్నాలపురం కనుకయ్య, కర్ణాకర్, యాకంరెడ్డి, కనకాచారి, రాజమల్లయ్య, రాంరెడ్డి, యాదగిరి, బాలసిద్దులు, సిద్ధిలింగం, చింటు, శివకుమార్, గణేష్, బాబు ఉన్నారు.

జాతీయ భద్రతా భావం పెంపొందించుకోవాలి



సర్టిఫికెట్లతో విద్యార్థులు

దేవరుప్పుల: ఎన్‌సీసీ విద్యార్థులు విద్యాభివృద్ధితోపాటు జాతీయ భద్రతా భావం పెంపొందించుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసు రాజు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 2022–24 ఎన్‌సీసీ బ్యాచ్ 21 మందికి ఏ–గ్రేడ్ ధ్రువీకరణ పత్రాలను 10వ బెటాలియన్ ఎన్‌సీసీ వరంగల్ అధికారులు హవాల్‌దార్ విజయ్ బీరదార్, ఉమేష్ గుప్తా చేతుల మీదుగా అందుకున్నారు. విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటడం అభినందనీయమని, ఇందుకు పాటుపడిన ఎన్‌సీసీ ఆఫీసర్ కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఖాజా, మహేష్, సరిత, మాధవి, అనిత, విజయలక్ష్మి, పాషా పాల్గొన్నారు.

కోతి వెంకన్న మృతి పార్టీకి తీరని లోటు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోతి వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన వెంకన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం ఎమ్మెల్యే మృతుడి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జలగం కుమార్, నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గోనె మహేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సోమేశ్వర్, భాస్కర్, రాము, అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ నిర్మల చంద్రబాబు, కేశవరావుల ఉన్నారు.

ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తాం

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సాగు నీటి కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి: గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైతులకు సరైన సమయంలో సాగు నీరందక ఇబ్బంది పడ్డారని, ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం పాలకుర్తి మండలం కోమటిగూడెం, బోయినగూడెం, గూడూరు, కోతులబాద, తిర్మలగిరి, నర్సింగాపూర్ గ్రామాలకు సంబంధించిన ఎస్సారెస్పీ సాగు నీటి కాల్వలను(4ఎల్, 5ఎల్) పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతుల సమస్యలను విన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు సరైనవి కావని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న నాయకులను రైతులు గ్రామాల్లో తిరగనివ్వరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, పులి గణేష్, జలగం కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ సర్పంచ్‌లు మాచర్ల పుల్లయ్య, అశోక్, శ్రీనివాస్, కమ్మగాని నాగయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టించుకోని అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న మహిళలు

బచ్చన్నపేట: ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 16 రోజులవుతున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని ఆలింపూర్ మహిళా రైతు ఎలికట్టె సునీత ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆమె మాట్లాడుతూ వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, అధికారులకు చెప్పినా ఇంత వరకు స్పందించ లేదన్నారు. కాగా, తనే ట్రాక్టర్ తెప్పించి పలువురు మహిళలతో కలిసి కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో ఎక్కించామన్నారు. మరమ్మతునకు బచ్చన్నపేట సబ్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రైతులపై ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

పరామర్శ



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన జోడుముంతల యాదమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. నాయకులు తోకల సంపత్‌రెడ్డి, కందుకూరి రజనీకర్, దోరం శ్రీనివాస్, నామాల రాహుల్, బ్రహ్మచారి, ఆవుల సుధాకర్, వంశి, ప్రశాంత్, రాకేష్, మహేష్, రాజ్‌కుమార్, సారయ్య ఉన్నారు.

ఇళ్ల స్థలాల కబ్జాను ఆపండి

జనగామ: జిల్లా కేంద్రం క్లాం రోడ్డులో 24 ఏళ్ల క్రితం పేద కుటుంబాలకు ఇచ్చిన ప్లాట్లను కొందరు కబ్జాకు పాల్పడి నిర్మాణాలు చేపట్టారు.. ఆ స్థలాలను కాపాడాలని సామాజిక కార్యకర్త, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు కూరపాటి శ్రీనివాస్ కలెక్టర్ రిజ్వాన్ బాషాను కోరారు. ఈ మేరకు గురువారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలో అప్పటి ప్రభుత్వం తహసీల్దార్ ద్వారా విచారణ చేపట్టి 120 గజాల చొప్పున 248 కుటుంబాలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కొంతమంది వ్యాపారాల ముసుగులో పేదలకు సంబంధించి 900 గజాల స్థలాన్ని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ప్రైవేట్‌గా గత ఏడాది విక్రయించారని, లబ్ధిదారులు నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను ఫిర్యాదులో కోరినట్లు వివరించారు. ఇందుకు సంబంధించిన కాపీని మున్సిపల్ కమిషన్, డీసీపీకి కూడా పంపించినట్లు తెలిపారు. అతడి వెంట కొండా కిరణ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పాలనతోనే దేశరక్షణ సాధ్యం



ప్రచారం చేస్తున్న నాయకులు

దేవరుప్పుల: బీజేపీ పాలనతోనే దేశ రక్షణ సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం పరిధిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ గెలుపు కోసం పాటుపడాలని విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ గ్రామీణ, పట్టణాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తే రాష్ట్రాన్ని ప్రతిపక్షపార్టీలు తమవిగా ప్రచారం చేస్తూ ఉనికి చాటుకుంటున్నాయని విమర్శించారు. కూలీల భద్రత కోసం లేబర్‌కార్డులు, ప్రోత్సాహకాలపై వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు గణేష్, నర్సింహాచారీ, రమేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగాలఘణపురం: మండలంలోని కుందారం వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న గంగపురం మహేందర్ ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

'నామినేషన్ దాఖలుకు తరలిరండి'



జనగామ రూరల్: భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్ దాఖలుకు కార్యకర్తలు భారీగా తరలి రావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ప్రకాశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టి భువనగిరిలో ఎర్ర జెండా ఎగిరేలా కృషి చేయాలన్నారు. మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. 19న నిర్వహించే రోడ్‌షోలో కార్యకర్తలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు యాదగిరి, విజేందర్, వెంకటమల్లయ్య పాల్గొన్నారు.

రాజీనామా

కొడకండ్ల: బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు, పాలకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేశగాని సతీష్‌గౌడ్ తన పదవులకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తనకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ ఎనలేని సహకారం అందించారని, బీఆర్‌ఎస్ పార్టీకి తాను ఎంతో రుణపడి ఉంటానని, తనపై పెట్టుకొన్న ఆశలను తప్పక నేరవేరుస్తానన్నారు. ప్రత్యేక పరిస్థితులు కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నియామకం



లింగాలఘణపురం: సమాచార హక్కు వికాస సమితి (ఎస్‌హెచ్‌వీఎస్) మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గూటం నాగరాజును నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రమాద కృష్ణారెడ్డి గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేయడానికి బాధ్యతగా పని చేస్తానని తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు.

'తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు'

దేవరుప్పుల: కాంగ్రెస్‌లో చేరిన ఎర్రబెల్లి కోటారి పార్టీ బాధ్యుల్ని తప్పుదోవ పట్టిస్తూ నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు ప్రమాదం తెస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుడు ఇప్ప పృథ్వీరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రత్యర్థులకు భయపడి నిశ్శబ్దంగా ఉన్న పలువురు నాయకులు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వద్దకు చేరి తమ ఆధిపత్యం కోసం తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇటీవల దేవరుప్పుల మండల అధ్యక్ష పదవి నుంచి తొలగించిన పెద్ది కృష్ణమూర్తికి ప్రత్యామ్నాయ బాధ్యతలు అప్పగించకుండా తాత్సారం చేయడంలోనే నిఖార్సైన నాయకులకు మొండిచేయి చూపే తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ మండల సమావేశం

కొడకండ్ల: స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో నేడు (శుక్రవారం) సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని ఎంపీటీసీ క్లస్టర్ల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరు కావాలని కోరారు.